క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకం లాభదాయకం

జనగామ రూరల్: చిన్న సన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని ఎంపీడీఓ హసీం అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గ్రామంలోని 5ఎకరాల లోపు సన్నకారు రైతులు ఎస్సీ, ఎస్టీ వారికి 100 శాతం, మిగతా వారికి 90 శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకానికి డ్రిప్ సిస్టం ఉందని అన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలోని ఎఫ్ఏలు, గ్రామ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. టీఏలు, ఎంపీఓ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన వంగాల లచ్చయ్య, ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన చెరుకు సైదులు కుటుంబాలను మంత్రి ఓదార్చారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిండె రామోజీ, సర్పంచ్ శిరీష పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు 34 మంది హాజరు

జనగామ రూరల్: డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన సదరం క్యాంపునకు 34 మంది మానసిక దివ్యాంగులు హాజరయ్యారని డీపీఎం ఎం.వినితరెడ్డి తెలిపా రు. వారికి పరీక్షలు నిర్వహించి అర్హులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు, మురళీ కృష్ణ, సిద్దారెడ్డి, అచ్యుత, అబ్దుల్ రెహమాన్, ఆర్థోపెడిక్ డాక్టర్ విశ్వనాథ్, వేణుగోపాల్, సమీర్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



లింగాలఘణపురం: లింగాలఘణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి గురువారం మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆరు కుటుంబాలకు రూ.30వేలు, అదేవిధంగా నవాబుపేటలో రంపె రాఘవులు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్‌ఎస్ నాయకుడు సంపత్‌ను, నెల్లుట్ల బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వీరస్వామి అనారోగ్యానికి గురికావడంతో ఆయనను పరామర్శించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, ప్రధాన కార్యదర్శి శ్రీపాల్‌రెడ్డి, నాగేందర్, ఎంపీటీసీ సిద్దు ఉన్నారు.

నిరుపేద అన్నాచెల్లెలికి చేయూత



కాజీపేట రూరల్: అన్నాచెల్లెలైన ఇద్దరు నిరుపేద విద్యార్థులకు కాజీపేట ఫాతిమానగర్ సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ కో ఆర్డినేటర్ వై.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్ మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు కమల్, సౌజన్యల తల్లిదండ్రులు కొంత కాలం క్రితం చనిపోయారు. ఉండటానికి ఇల్లు లేని ఆ నిరుపేద విద్యార్థులు కమల్ ఇంటర్, సౌజన్య 10వ తరగతి అష్టకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఈ మేరకు వారికి భాస్కర్‌రెడ్డి తన స్నేహితుల సహకారంతో రూ.18 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్స్ లూర్దుమేరి, ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

'రహస్య సమావేశం నిర్వహించలేదు'

పాలకుర్తి టౌన్: కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్న తాను పార్టీ మారుతున్నానని వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్. సుధాకర్‌రావు అన్నారు. గురువారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ తనపై తప్పుడు ప్రచారం చేయడం తగదని అన్నారు. తాను పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లుగా వచ్చిన తప్పుడు సమాచారం ఎవరూ నమ్మకూడదని కోరారు. తాను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో ఉన్నానని చెప్పారు.

అక్రమ డిప్యుటేషన్ రద్దు చేయాలి

పాలకుర్తి: అక్రమ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గురువారం ఈ సందర్భంగా పాలకుర్తిలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎంఈఓ భగవాన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మండల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

జోరు వాన

రఘునాథపల్లి :కొట్టుకు పోయిన కాజ్‌వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



జనగామ: 17వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రజిత, పక్కన కౌన్సిల్ అనిత



జనగామ రూరల్ : తెగిపోయిన ఎర్రగొల్లపహాడ్ కల్వర్టు



జనగామ: కుర్మవాడలో..




జిల్లాలో కురుస్తున్న జోరు వానతో వరద పోటెత్తింది. పొలాలను ముంచివేసింది. రహదారులు ధ్వంసమయ్యాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. వందల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీటి పాలయ్యాయి. పట్టణంలో వరదనీటితో పలు కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ నీటమునగడంతో వాహనదారులు, వ్యాపారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



జనగామ:దుర్గానగర్ కాలనీలో వరద నీరు



దేవరుప్పుల : పొంగిపొర్లుతున్న కోలుకొండ వాగు చెక్‌డ్యామ్



చిల్పూరు: నష్కల్ ఆకేరు వాగు వద్ద చేపలు పడుతున్న స్థానికులు



లింగాలఘణపురం : పారుతున్న చీటూరు వాగు



జఫర్‌గఢ్ : అల్వార్‌బండ తండా మత్తడి కెనాల్ వద్ద అధికారుల పర్యవేక్షణ



జనగామ: దుకాణాల ఎదుట వరదనీరు



జనగామ రూరల్: వరి నీటమునగడంతో దిగాలుగా రైతు లింగాల చంద్రమౌళి



బచ్చన్నపేట: ఆలీంపూర్‌లో నీటమునిగిన వరిపొలం



స్టేషన్‌ఘన్‌పూర్ : కోమటిగూడెంలో కూలిన పెంకుటిల్లు వద్ద బాధితుడు



జనగామ:హైదరాబాద్ రోడ్డుపై నిలిచిన వరద నీరు

ఓటరు నమోదుపై అవగాహన అవసరం

చిల్పూరు: వయోజనులైన ప్రతీ ఒక్కరు ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా సాగేలా అవగాహన పొందాలని మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో ఫొటో ఎలక్ట్రోరల్ రోల్ 2వ ఎస్ఎస్ఆర్-2023 బూత్ లెవల్ అధికారులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతకు, సవరణ, తొలగింపు, చిరునామా మార్పు, ఫొటో సవరణకు సంబంధిత సరైన ధ్రువీకరణ పత్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ దరఖాస్తు చేసుకున్న వారికి విధిగా ఓటు హక్కు అందించేలా తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. తహసీల్దార్ గుగులోత్ దేవ్‌సింగ్, డీటీ విమల, ఎంఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తం ఉండాలి

పాలకుర్తి: వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, ఎస్సై. శ్రీకాంత్‌లు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ వర్షంలో రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు ముట్టుకోవద్దన్నారు. చెరువుల్లో చేపలు పట్టే వారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు కలిగితే వెంటనే సమాచారం అందించాలని అన్నారు.

చేపల వేటకు వాగులోకి దిగితే చర్యలు

చిల్పూరు: భారీ వర్షాలు కురుస్తున్నందున నష్కల్ ఆకేరువాగు విపరీతంగా మత్తడి పోస్తుండటంతో చేపల వేట కోసం అందులోకి ఎవరు దిగినా చర్యలు తప్పవని ఎస్సై వినయ్‌కుమార్ హెచ్చరించారు. నష్కల్‌లో ఆకేరు వాగు చెక్‌డ్యామ్ గురువారం సాయంత్రం నుంచి మత్తడి పోస్తుండగా గ్రామస్తులు చేపల కోసం వాగులోకి దిగారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కర్నెకంటి స్వప్నవెంకటేష్ ఎస్సైకి సమాచారం అందించారు. సిబ్బందితో అక్కడకు చేరుకున్న ఆయన పలువురిని హెచ్చరించి వదిలేశారు. నేటి నుంచి కానిస్టేబుల్‌ను నియమించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌కు రాజకీయ సమాధి తప్పదు

స్టేషన్‌ఘన్‌పూర్: రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుందని వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో రాజకీయ సమాధి తప్పదని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని నమిలిగొండ రైతువేదికలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో క్లస్టర్ రైతుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. రైతులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి బేషరతుగా రాష్ట్ర రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

140 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ..

మండలంలోని నమిలిగొండలో సొంత ఇళ్లు లేని నిరుపేదలకు 140 మందికి ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజయ్య ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతీ పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. అదేవిధంగా గ్రామానికి 30 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని, త్వరలో ఫైనల్ గ్రామసభ నిర్వహించి లబ్ధిదారుల తుది జాబితాను రెవెన్యూ అధికారులు తయారు చేస్తారన్నారు. జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, ఇంఛార్జీ ఆర్‌డీఓ సుహాసిని, తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, ఆర్ఐ అర్జున్, సర్పంచ్ డ్యాగల ఉప్పలస్వామి, ఉపసర్పంచ్ రాంచంద్రం, వీఆర్ఏ పాలెపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ల అందజేత

జనగామ: నియోజకవర్గంలోని యువతీ, యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ పత్రాలను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అందించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. నియోజకవర్గంలో 18 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరు తమ సొంత ఖర్చులతో అందించే ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ట్రస్టు సహకారాన్ని యువత వినియోగించుకోవాలి

దేవరుప్పుల: రోడ్డు నిబంధనలు పాటిస్తూ భద్రతతో కూడిన ప్రయాణం పొందేందుకు యువత ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ అవకాశాన్ని వినియోగించుకోవాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు బానోత్ నవీన్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ మండల కార్యాలయంలో మంత్రి దయాకర్‌రావు సహకారంతో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల దరఖాస్తులను ఆయన స్వీకరించారు. యువజన మండల నాయకులు గుండె రమేష్, దాసగాని భరత్ పాల్గొన్నారు.



స్లాట్ పత్రాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

గ్రామాల్లో పీరీల సందడి

చిల్పూరు: పీరీల పండుగను పురస్కరించుకుని గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పీరీల ఊరేగింపు చేశారు. పీరీలను ఎత్తుకుని ఇంటింటికి వెళ్తుండగా గ్రామస్తులు కానుకలు సమర్పించి పీరీలకు మొక్కులను చెల్లించుకున్నారు.

మహాసభకు తరలిరావాలి

జనగామ రూరల్: ఎస్సీ వర్గీకరణ చేయాలని ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహా సభకు మాదిగ ఉపకులాలు వేలాదిగా తరలిరావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఎం.శ్యామ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుందన్నారు. శుక్రవారం విశ్వరూప మహా సభ సన్నాహక సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరు అవుతున్నారని తెలిపారు. గువ్వల రవి, బొట్ల మహేష్, జేరిపోతుల సుధాకర్, రవీందర్ పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలి

పాలకుర్తి టౌన్: మండలంలోని గిరిజన తండాల్లో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని సంఘం జిల్లా నాయకుడు అనిల్ చౌహాన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్షాలకు సీజనల్ వ్యాధులు రాకుండా తండాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. గిరిజన తండాల్లో సరైన రోడ్డు సదుపాయం లేనందున అసౌకర్యాలకు గురి అవుతున్నారని చెప్పారు. గిరిజన హాస్టళ్లు, హరిజన హాస్టళ్లలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు నెలకొల్పాలని కోరారు.

టీడీపీ పట్టణ కమిటీల ఎన్నిక

జనగామ: పట్టణంలోని పలు వార్డుల్లో టీడీపీ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. బుధవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య అధ్యక్షతన, కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో 6, 7, 8, 9, 10 వార్డుల్లో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుని, నియామక పత్రాలను అందజేశారు. నూతన కమిటీ 6వ వార్డు అధ్యక్షుడిగా కొత్తపల్లి ధనసాగర్, కార్యదర్శిగా కొత్తపల్లి ప్రకాష్, 7వ వార్డు అధ్యక్షులుగా రంపా వెంకటేష్,, కార్యదర్శిగా నాగరోని విజయ్. 8వ వార్డు అధ్యక్షుడిగా ఎండీ ఫాయాజ్, కార్యదర్శిగా గంగరాజు ఉపేందర్. 9వ వార్డు అధ్యక్షుడిగా ఎండీ సిరాజ్, కార్యదర్శిగా రొండ్ల ఏళ్ల రెడ్డి, 10వ వార్డు అధ్యక్షుడిగా బైరు రేణుక, కార్యదర్శిగా నమిళ్ళ పరుషరాములును ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ఎల్లేశ్, బైరబాబు, ఎండి ఇక్బాల్, ఉదయ్‌సింగ్ బాబ్జి, సీసాశ్రీధర్, చెప్యాల ప్రసాద్, సబ్బాని పాండు, ఎండి సిరాజ్, రొండ్ల ఎల్లారెడ్డి, సుద్దాల సురేష్, కొత్తపల్లి ధన సాగర్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న సమ్మయ్య

కార్యకర్తల కుటుంబాలకు అండ



చెక్కు అందజేస్తున్న సతీష్‌రెడ్డి

బచ్చన్నపేట: సీఎం కేసీఆర్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటున్నారని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం కొడవటూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త మిన్నాలపురం రామస్వామి మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ ఇన్సూరెన్స్ రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని తెలిపారు. నాయకులు చెట్టె రాములు, మిన్నాలపురం కనుకయ్య, కనకాచారి, శివకుమార్, సిద్దిలింగం, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దేవరుప్పుల/బచ్చన్నపేట/కొడకండ్ల/చిల్పూరు/రఘునాథపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయపరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింద శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జీపీ ఉద్యోగులు, కార్మికుల 15వ రోజు దీక్షలో మోకాళ్లపై నిరసన తెలుపగా ఆయన సంఘీభావం తెలిపారు. పంచాయతీ కార్మికుల సమ్మె విరమించేందుకు ప్రభుత్వం కుట్రలకు స్వస్తి పలికి జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు మంత్రి దయాకర్‌రావు పాటుపడాలని డిమాండ్ చేశారు. అలాగే బచ్చన్నపేట, కొడకండ్ల, చిల్పూరు, రఘునాథపల్లి తదితర మండలాల్లో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. తమ సమస్యలు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. చిల్పూరులో చేపట్టిన సమ్మెలో భాగం కార్మికులు చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. సమ్మెలో సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు?

- పల్లగుట్టలో డబుల్‌బెడ్రూం ఇళ్లు పూర్తయినా పంపిణీ చేయని వైనం
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

చిల్పూరు: మండలం పల్లగుట్టలో నిలువ నీడ లేని వారి కోసం నిర్మాణాలు పూర్తి చేసుకున్న డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడా అని 6 ఏళ్లుగా అర్హులు ఎదురుచూస్తున్నారు. 2017లో రూ. 188.70 లక్షలతో రెండు పడకల గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శంకుస్థాపన చేశారు. అవి పూర్తి అయినప్పటికీ పంపిణీ చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు జాప్యం చేస్తుండడంతో ఇళ్లు లేని పేదలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు పేకాట, మద్యం బాబులకు అడ్డాగా మారాయి. ఇక చిల్పూరు మండల కేంద్రంలో 40 మంది లబ్ధిదారులను గుర్తించి వారికోసం రెండు పడకల గదుల నిర్మాణం కోసం 2019 డిసెంబర్ 29న ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. ఎప్పుడు ఇళ్లు నిర్మించి తమకు అందజేస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.



పల్లగుట్టలో పంపిణీ చేయని డబుల్ బెడ్రూం ఇళ్లు

పేదలకు వెంటనే ఇవ్వాలి..



బీఆర్‌ఎస్ ప్రభుత్వం గూడు లేని వారి కోసం డబుల్ బెడ్రూం ఇళ్లను పల్లగుట్టలో నిర్మించింది. పూర్తి చేసిన ఇళ్లను పంపిణీ చేసేది ఎప్పుడా అని పేదలు ఎదురుచూస్తున్నారు. వెంటనే పంపిణీ చేయాలి.

\- ఊరడి శ్రీనివాస్, వైఎస్సార్‌టీపీ నాయకుడు

త్వరలో అందజేస్తాం..



పల్లగుట్టలో త్వరలో గ్రామ సభ నిర్వహిస్తాం. వాస్తవంగా ఎవరికైతే ఇళ్లు లేవో వారికి అందిస్తాం. ఈ విషయంలో గోప్యత అనేది లేకుండా అర్హులకు అందజేస్తాం. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందొద్దు.

\- గుగులోత్ దేవ్‌సింగ్, తహసీల్దార్

బస్వ రామచంద్రును ఆదర్శంగా తీసుకోవాలి

దేవరుప్పుల: గుంటెడు భూమిలేకున్నా పట్టాదారు పుస్తకం పొంది ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్న తరుణంలో స్వచ్ఛందంగా తన పేరిట ఉన్న తప్పుడు పట్టాభూమి రికార్డులు తొలగించాలని ముందుకొచ్చిన బస్వ రామచంద్రును ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల తహసీల్‌కు సీతారాంపురానికి చెందిన కారోబార్ బస్వ రామచంద్రు వచ్చి కడవెండి రెవెన్యూ పరిధి సీతారాంపురం శివారులోని 839/ఇ/2 సర్వే నంబరులో 0.37 గుంటల భూమి ఉన్నట్టు పట్టాదారు పుస్తకం జారీ అయిందని పేర్కొన్నారు. తనకు గుంటెడు భూమిలేకున్నా రికార్డులు కలిగి ఉండడం తప్పుగా భావించిన ఆయన తన కొడుకు, కూతురుల సూచనల మేరకు సదరు రికార్డుల ప్రతులను తహసీల్దార్‌కు అప్పగించారు. ఆయా గ్రామాల్లో ఇలాంటి తప్పుడు రికార్డు పట్టాదారు భూమి కలిగి ఉన్న వారు తొలగించేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తే ఆర్ఎస్ఆర్ సమస్య అనివార్యంగా పరిష్కారం అవుతుందన్నారు.



తహసీల్దార్‌కు భూమిపట్టా తొలగించాలని వినతి పత్రం ఇస్తున్న రామచంద్రు

చికిత్స పొందుతున్న రైతు మృతి

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామానికి చెందిన రైతు పారుపెల్లి నర్సయ్య (50) భూవివాదం కారణంగా మనస్థాపంతో పురుగుల మందు తాగి ఎంజీఎంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పారుపెల్లి నర్సయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో నర్సయ్య సోదరుడు బాలరాజు 15 గుంటల భూమిని నర్సయ్యకు రాసిచ్చాడు. ఈ భూమి విషయంలో రెండు కుటుంబాల మధ్య తలెత్తిన వివాదంతో తీవ్ర మనస్థాపానికి గురైన నర్సయ్య ఈ నెల 17వ తేదీన పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం అస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఉన్నారు. కాగా, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.